# సత్యవాక్కు

# THE WORD OF TRUTH

## క్రైస్తవ మాసపత్రిక

AUGUST - 2009

సంవత్సర చందా రూ. 50/-

# ప్రకటన గ్రంథము
# ఉపదేశ మాలిక
# ఇప్పుడు లభించుచున్నది

**200** పేజీలతో అందమైన కవర్‌తో ముద్రించబడి యున్నది.

| | |
|---|---|
| ఒక్కొక్క కాపీ | **50/-** రూ॥లు మాత్రమే |
| పోస్టేజీ | **10/-** రూ॥లు |

ప్రకటన గ్రంథ ఉపదేశమాలిక వలయు వారు దిగువ చిరునామాకు **M.O.** పంపి దానిని పొందవచ్చును.


***Satya Vani***

7-9-35, Sambamurty Street

Kakinada - 533 004

Ph: 0884- 2363722

# సత్యవాక్యం

## THE WORD OF TRUTH

P.o. Box -80, Kakinada,A.P. 533 001
Ph : 0884 - 2363722

Editor :
**Joshua Gootam**

*Pleading for Restoration of First Century Christianity*

సంపుటి ౩౦ | ఆగస్టు ౨౦౦౯ | సంచిక -1


# దేవుని కృపను గైకొనుట

(Taking Advantage of God's Grace)

## క్రీస్తు చట్టము

గతసంచికల్లో మన రక్షణార్ధమై క్రీస్తులో ఉంచబడిన ఆత్మీయాశీర్వాద ములను గూర్చి తెలిసికొన్నాము. ఈ ఆశీర్వాదముల ననుభవించుటలో దేవునితో మనము సమాధానమును, సత్సంబంధమును కలిగి యుంటాము. ఆయన వాగ్దానము చేసిన సమృద్ధియైన జీవితం యిది. "ప్రయాసపడి భారము మోసికొనుచున్న సమస్తమైన వారలారా, నాయొద్దకు రండి. నేను మీకు విశ్రాంతి నిత్తునని" యేసుప్రభువు వాగ్దానం చేసారు (మత్తయి 11:28). మనకు సమృద్ధియైన జీవము కలిగించుటకు ఆయన ఈ లోకానికి వచ్చారు (యోహాను 10:10). "నాయందు మీకు సమాధానము కలుగునట్లు ఈ మాటలు మీతో చెప్పుచున్నానని" ఆయన చెప్పెను (యోహాను 16:33). గనుక యేసు ప్రభువు యిచ్చు సమృద్ధియైన జీవితమును, శాంతిని కలిగి యుండునట్లు ఒకడు ఆయన యందు ఎట్లుండునో మనము తెలిసికొందము.

ఈ విషయాన్ని తెలిసికొనుటలో మానవులందరు క్రీస్తు చట్టమునకు బద్ధులైయుండాలి, ఆయన చట్టానికి లోబడిన వారందరు దేవుని కృపవలన రక్షింపబడుదురు. మరియు మనము ఆయన చట్టమునకు లోబడుట యెట్లో బైబిలు మనకు బోధించుచున్నదియను అంశములను ధ్యానించుదము.

దేవుని కృపను మనము పొందాలంటే ఆయన చట్టప్రకారము మనము నడుచుకోవాలి. అయితే బైబిలు నందున్న ఆజ్ఞలన్నియు అందరికొరకు, అన్నివేళల వర్తించేవి కావని గ్రహించాలి.

పాతనిబంధన కాలములోనే దేవుడు ఒక నూతన నిబంధనను యిత్తునని వాగ్దానము చేసారు. దేవుడు పాతనిబంధనను లేక మోషే ధర్మశాస్త్రము ను వాగ్దానము చేసెను. దేవుడు పాతనిబంధనను లేక మోషే ధర్మశాస్త్రము ను ఇశ్రాయేలీయులకే యిచ్చెను. ద్వితీయోపదేశకాండము 5:3లో మోషే ఈ సంగతిని ఇట్లు చెప్పాడు: "యెహోవా, మన పితరులతో కాదు, నేడు ఇక్కడ నజీవులమై యున్న మనతోనే ఈ నిబంధన చేసెను". పాత నిబంధన కాలములో యున్న యూదులకు మాత్రమే మోషే ధర్మశాస్త్రము ఈయబడెను. అయినను "ఇదిగో నేను ఇశ్రాయేలు వారితోను, యూదావారి తోను క్రొత్త నిబంధన చేయు దినములు వచ్చుచున్నవి; ఇదే యెహోవా వాక్కు అది ఐగుప్తులోనుండి వారిని రప్పించుటకై నేను చేసిన నిబంధన వంటిది కాదు..... ఈ దినములైన తరువాత నేను ఇశ్రాయేలువారితోను యూదావారితోను చేయబోవు నిబంధన యిదే; వారి మనస్సులలో నా ధర్మవిధి ఉంచెదను, వారి హృదయము మీద దాని వ్రాసెదను; యోహోవా వాక్కు యిదే" అని ప్రవక్తయైన యిర్మియా ద్వారా ఆయన పలికెను (యిర్మియా 31:31-34).

"ఆయన క్రొత్తనిబంధన అని చెప్పుట చేత మొదటిది పాతదిగా చేసియున్నాడు. ఏది పాతగిలి ఉడిగిపోవునో అది అదృశ్యము అగుటకు సిద్ధముగా ఉన్నదని" అపో.పౌలు హెబ్రీ 8:13లో చెప్పుచున్నాడు. పాతనిబంధన ఒక ..ట్టము వలె క్రైస్తవులపై నేడు లేదుగాని గతంలో దేవుడు ప్రజలతో సంప్రదించిన విధానమును తెలిసికొనుటకు అది వ్రాయబడి యున్నది. "మనకు నిరీక్షణ కలుగుటకై పూర్వమందు వ్రాయబడిన వన్నియు . మనకు బోధకలుగు నిమిత్తము వ్రాయబడియున్నవి" (రోమా 15:4). "ఈ సంగతులు దృష్టాంతములుగా వారికి సంభవించి యుగాంత మందున్న మనకు బుద్ధికలుగుటకై వ్రాయబడెను"(1కొరింథీ 10:11)

అది ఇశ్రాయేలీయులకు వర్తించే చట్టము అని మనము పాతనిబంధనను చదువుట మానివేయరాదు. అది కూడ పరిశుద్ధాత్మావేశము వలన వ్రాయబడిన దేవుని గ్రంధమే. యేసుక్రీస్తుని నిరూపించుట కొరకు ఆదిమ క్రైస్తవులు పాతనిబంధన గ్రంధమును ఉపయోగించిరి. మరియు క్రొత్తనిబంధన గ్రంధము లిఖించబడకముందు, ఆదిమ క్రైస్తవులు పాతనిబంధన లేఖనములను బట్టి హెచ్చరింపబడిరి. అందువలన అపో. పౌలు ఇట్లనుచున్నాడు: "దైవజనుడు సన్నద్ధుడై ప్రతిలేఖనము ఉపదేశించుటకును, ఖండించుటకును, తప్పుదిద్దుటకును, నీతియందు శిక్షచేయుటకును ప్రయోజనకరమై యున్నది" (2తిమోతి 3:16-17).

అయితే క్రైస్తవులు పాతనిబంధనకు గాక క్రొత్తనిబంధనకు బద్ధులై యున్నారు. పాతనిబంధన యూదులకు మాత్రమే ఒక చట్టముగా ఈయబడెను.

పాతనిబంధన చట్టము ఇయ్యబడక ముందు దేవుడు తన చట్టమును నేరుగా ఆయా గోత్రముల పితరులకు తెలియజేసారు. పూర్వకాలమందు దేవుడు నానా విధములుగాను, నానా సమయములలోను మన పితరులతో మాటలాడెనని హెబ్రీ 1:1 చెప్పుచున్నది. అయితే ఇశ్రాయేలీయులకు దేవుడు సీనాయి కొండమీద ధర్మశాస్త్రము నిచ్చినప్పుడు, అన్యజనులు దానిలో ఇమడ్చబడలేదు, గాని లిఖితపూర్వక ధర్మశాస్త్రము ఇయ్యబడక ముందు దేవుడు ఏ చట్టమును ఉపయోగించెనో దాని ప్రకారము అన్యజనులు కూడ ప్రవర్తించుచు వచ్చిరి.

మోషేద్వారా సీనాయి పర్వతము మీద దేవుడు ధర్మశాస్త్రము నియ్యక ముందు మానవులందరు దేవుడు పితరులకు యిచ్చిన శాసనములను బట్టి, సూత్రములను బట్టి నడుచుకొనుచుండిరి. "ధర్మశాస్త్రము లేని అన్యజనులు స్వాభావికముగా ధర్మశాస్త్ర సంబంధమైన క్రియలను చేసిన యెడలవారు ధర్మశాస్త్రము లేనివారైనను, తమకు తామే ధర్మశాస్త్రమైనట్టున్నారు. అట్టివారి మనసాక్షి కూడ సాక్ష్య మిచ్చుచుండగను, వారి తలంపులు ఒక దానికొకటి తప్పువెూపుచు లేక తప్పులేదని చెప్పుచుండగను ధర్మశాస్త్రసారము తమ హృదయములందు వ్రాయబడినట్లు చూపుచున్నారు" అని రోమా 2:14-15 లో పౌలు చెప్పుచున్నాడు. అయితే సీనాయి వద్ద యూదులను దేవుడు వేరొక ధర్మశాస్త్రము నకు బద్దులుగా చేసారు. అన్యజనులైతే సృష్టిజరిగిన నాటినుండి అమలులో యున్న దేవుని వాక్య సంబంధమైన నియమావళిని బట్టి

ప్రవర్తించుచుండిరి. అది లిఖిత పూర్వకమైనది కాదు. తమ పితరుల కిచ్చిన నైతిక సూత్రములను బట్టి వారు ప్రవర్తించాలని దేవుడు వారిని కోరాడు.

అయితే తానొక నిబంధనను చేయుదునని, అది సమస్తజనులకు వర్తించునని దేవుడు వాగ్దానము చేసారు (యిర్మి 31:31-34). ఈ నూతన నిబంధన వారి హృదయములపై వ్రాయబడును.

హెబ్రీపత్రిక 8:7-8లో దేవుడు యిర్మియా ద్వారా చేసిన ప్రవచనము యొక్క నెరవేర్పు క్రీస్తుద్వారా ఈయబడిన క్రొత్తనిబంధనలో జరిగెనని పౌలు చెప్పాడు. పాతనిబంధన తీసివేసి క్రొత్తనిబంధనను యిచ్చుటకు క్రీస్తు వచ్చెను అని హెబ్రీ 10:9 చెప్పుచున్నది.

క్రీస్తుద్వారా కలిగిన నూతన నిబంధన అందరికీ వర్తించుచున్నది. మానవుడు తన పాపములనుండి రక్షింపబడి క్రీస్తులోయున్న సమృద్ధియైన జీవితాన్ని అనుభవించాలంటే క్రొత్తనిబంధన యిచ్చు ఆజ్ఞలకు లోబడాలి. దాని ప్రకారము జీవించాలి. నీవు యేసుప్రభువునందు విశ్వసించి, పాపముల విషయమై మారుమనస్సు పొంది పాపక్షమాపణ నిమిత్తము బాప్తిస్మము పొందాలని అది ఆజ్ఞాపించుచున్నది. నమ్మి బాప్తిస్మము పొందాలని అది ఆజ్ఞాపించుచున్నది. నమ్మి బాప్తిస్మము పొందిన వానిని ఆయన రక్షించును, నమ్మనొల్లక పోయినవానికి శిక్షవిధించును (మార్కు 16:16).

# ఇచ్చుటే అసలు పరీక్ష

(Giving is the Acid Test)

"ఆజ్ఞాపూర్వకముగా మీతో చెప్పుటలేదు. ఇతరుల జాగ్రత్తను మీకు చూపుట చేత మీ ప్రేమ ఎంత యథార్థమైనదో పరీక్షింపవలెనని చెప్పుచున్నాను" (2కొరింథీ 8:8). మన రాబడిలో కొంతదేవుని కిచ్చుటలో క్రీస్తుకు మనం ఎంతవరకు నమ్మకముగా యున్నామో పరీక్షింపబడ్తాది.

మన వాడుకలో యున్న ప్రతివస్తువు పరీక్షింపబడే యుగములో మనమున్నాము. మన కార్లు, రిఫ్రిజిరేటర్లు, టి.వీలు, దుస్తులు, నిజానికి అన్నీముందే పరీక్షింపబడ్తాయి. పెట్టుబడిదార్లను, వినియోగదార్లను సంరక్షించుట కొరకు యిది జరుగును.

దేవుడు మనలను ఎందుకు

పరీక్షిస్తారో తెలుసుకొనడం తేలికకాదు. గాని మానవుడు పరీక్షింప బడినసందార్భాలు బైబిలు నిండాయు న్నాయి. "శోధన సహించు వాడు ధన్యుడు. అతడు శోధనకు నిలిచిన వాడై ప్రభువు తన్ను ప్రేమించువారికి వాగ్దానము చేసిన జీవ కిరీటము పొందును" (యాకోబు 1:12).

ఆదికాండము 22వ అధ్యాయ ములో అబ్రాహాము తన కుమారుడైన ఇస్సాకును అర్పించడం చూస్తాము. యిది అబ్రాహాము జీవితంలో గొప్ప పరీక్షయే. అతడా పరీక్షలో గొప్పగా విజయంసాధిం చాడు. ఆ సంఘటనను చదువుము.

యోబు మొదటి అధ్యాయము లోనే యోబుకు కలిగిన శోధనలు, పరీక్షను గూర్చి చదువుతాము. యోబు గ్రంధాన్ని కూడ చదువుము. ఆ పరీక్షలో నిలిచినవాడై యోబు పుటము వేయబడిన బంగారము వలెమనకు కనబడ్తాడు. శ్రేష్టమైన వ్యక్తిగా కనబడ్తాడు. దేవుని మాటను అతడెన్నడు శంకించలేదు. అయితే నేడు క్రీస్తు సంఘసభ్యులందరి యెదుట యున్న గొప్ప పరీక్ష - తమ రాబడిలో దేవునికి ధారాళముగా యిచ్చుటయే.

**ఇచ్చుట మన విశ్వాస పరీక్ష**

నేనువున్నా గ్రామములో బాప్తిస్మము, ప్రభురాత్రి భోజనము అనేవి ఆ రోజుల్లో పెద్ద పరీక్షగా భావించబడేవి. డబ్బును గూర్చి ఎవరైనా ఏమైన చెబితే సహజంగా ప్రజలు చికాకుపడేవారు. బోధకుడు డబ్బుకొరకే బోధించుచున్నాడని కొందరు అనేనరికి బోధకుడు భయపడేవాడు. అయితే ప్రభువుకు స్తోత్రము కలుగునుగాక, కొందరు సోదరులు యిచ్చుటను గూర్చిన సత్యాన్ని నిష్కర్షగా బోధించేవారు.

దేవుడు అబ్రాహాము యొక్క విశ్వాసాన్ని పరీక్షించాలను కొన్నప్పుడు అతడు తన కుమారుని బలిగా యియ్యాలని కోరారు. దేవుడు కోరుచున్నది అదే అయితే తన కుమారుని ప్రాణమును సయితము దేవుని కర్పించు టకు వెనుదీయక అబ్రహాము తన విశ్వాసాన్ని నిరూపించాడు. అబ్రాహాము "అవిశ్వాసము వలన దేవుని వాగ్దానము ను గూర్చి సందేహింపక దేవుని మహిమ పరచి ఆయన వాగ్దానము చేసిన దానిని నెరవేర్చుటకు సమర్థుడని రూఢిగా విశ్వసించి విశ్వాసము వలన బలముపొందెను" అని అపొ. పౌలు చెప్పాడు (రోమా 4:20).

మానవుడు విశ్వాసములో బలహీనుడైతే ఇయ్యవలసిన రీతిగా ఇచ్చుటకు నిరాకరించును. అల్ప విశ్వాసము మనకు తరచు కనబడుచున్నదే. ప్రభువు తన శిష్యుల

అల్ప విశ్వాసాన్ని తరుచు గద్దించేవారు. ఏమి తిందుమో, యేమి ధరించుకొందుమో యని ఆయన శిష్యులు చింతించేవారు. యేమి త్రాగుదుమో అని మీ ప్రాణమును గూర్చి యైనను, ఏమి ధరించుకొందుమో యని మీ దేహమును గూర్చియైనను చింతింపకుడి. ఆహారము కంటె ప్రాణమును, వస్త్రము కంటె దేహమును గొప్పవి కావా? ఆకాశ పక్షులను చూడుడి. అవి విత్తవు కోయవు, కొట్లలోకూర్చుకొనవు. అయినను మీ పరలోకపు తండ్రి వాటిని పోషించుచున్నాడు. మీరు వాటి కంటే బహుశ్రేష్టులు కారా ? మీలో నెవడు చింతించుట వలన తన యెత్తు మూరెడెక్కువ చేసికొనగలడు? వస్త్రములను గూర్చి మీరు చింతించుట యేల? అడవి పువ్వులు ఏలాగు నెదుగుచున్నవో ఆలోచించండి. అవి కష్టపడవు ఒకడవు. అయినను తన సమస్త వైభవముతో కూడిన సొలోమోను సహితము వీటిలో నొకదానివలె నైనను అలంకరింపబడలేదు. నేడుండి రేపు పొయిలో వేయబడు అడవి గడ్డిని దేవుడీలాగు అలంకరించిన యెడల అల్పవిశ్వాసులారా, మీకు మరి నిశ్చయముగా వస్త్రములు ధరింపజేయునుగదా" (మత్తయి 6:25-30).

మత్తయి 8వ అధ్యాయములో యేసు ప్రభువు ఒక దోనెలో నిద్రించుచుండగా తుఫాను సంభవించిన సంగతిని చూడవచ్చును. ప్రభువా నశించుచున్నాము అని చెబుతు ఆయన శిష్యులు ఆయనను నిద్ర లేపారు. అల్ప విశ్వాసులారా, మీరెందుకు భయబడితిరి? యని ఆయన వారిని గద్దించారు. మత్తయి 14:25-31లో యేసు నీళ్లమీద నడుచుచు తన శిష్యుల యొద్దకు వచ్చారు. "పేతురు – ప్రభువా, నీవే అయితే నీళ్ల మీద నడిచి నీ యొద్దకు వచ్చుటకు నాకు సెలవిమ్మని ఆయనతో అనెను". అతడు నీళ్లమీద నడిచెను గాని గాలిని చూచి భయపడి మునిగిపోయెను. ప్రభువా నన్ను రక్షించుమని కేకలు వేసెను. వెంటనే యేసు చెయ్యి చాపి అతని పట్టుకొని – అల్పవిశ్వాసీ యెందుకు సందేహపడితివని అతనితో చెప్పెను.

మత్తయి 16:5-8లో యేసు పరిసయ్యులు, సద్దూకయ్యులు అనువారి పులిసిన పిండిని గూర్చి జాగ్రత్తపడుడని శిష్యులతో చెప్పెను. యేసు రొట్టెలను గూర్చి చెబుతున్నారని వారు తలంచారు. "యేసు అదియెరిగి – అల్పవిశ్వాసులారా, మన యొద్ద రొట్టెలు లేవని మీలో మీరెందుకు ఆలోచించుకొనుచున్నారు?" అని వారిని గద్దించెను. దేవుడు చేసిన వాగ్దానములను మనం నమ్మినప్పుడే ధారళముగా ఆయనకు ఇయ్యగలము.

**ఇచ్చుట మన విశ్వాసానికొక పరీక్ష**

దేవుని ప్రేమను గూర్చి చెప్పేటప్పుడు యోహాను 3:16 తప్పక జ్ఞాపకం చేసుకొంటాము. "దేవుడు లోకమును ఎంతో ప్రేమించెను. కాగా ఆయన తన అద్వితీయ కుమారునిగా పుట్టిన వానియందు విశ్వాసముంచు ప్రతివాడును నశింపక నిత్యజీవము పొందునట్లు ఆయనను అనుగ్రహించెను". దేవుడు ఎంతో ప్రేమించెను. తన కుమారుని యిచ్చెను. తన కుటుంబము కొరకు ఒక తండ్రి ఎంతైనా త్యాగం చేస్తాడు. అయితే అతడు తన సంపాదనను వేరొకరికి ఖర్చు చేస్తే మనం ఏమనుకొంటాము? మనం దేవుని ప్రేమిస్తేనే ధారాళముగా ఇచ్చుటకు పూనుకొంటాము. నశించిన వారిని గూర్చిన ప్రేమను బట్టి వారు సువార్త విని రక్షింపబడునట్లు మనం ధారాళముగా ఇయ్యాలి.

**ఇచ్చుట మన దృక్పథానికి పరీక్ష**

దైవ దృక్పథము లేనియెడల జనులు నశింతురని సోలోమోను చెప్పాడు (సామె 29:18). చాలమందికి తమ స్థానిక పనియే చాలుననుకొంటారు. యేసు ఇట్లు చెప్పారు : "ఇంక నాలుగు నెలలైన తరువాత కోతకాలము వచ్చునని మీరు చెప్పుదురు గదా. ఇదిగో మీ కన్నులెత్తి పొలములను చూడుడి. అవి ఇప్పుడే తెల్లబారికోతకు వచ్చియున్నవి" (యోహాను 4:35). ధారాళముగా ఇయ్యాలనుకొంటే అతని దృక్పథము ఎంత విశాలముగా యుండాలి? అవసరాన్ని గుర్తించగలిగితే చాలు.

అంతియొకయలోనున్న సహోదరులు యెరూషలేముకు సహాయము పంపినప్పుడు వారు యూదయ సహోదరుల అవసరాలను గూడ చూడగాలిగారు. "ఆ దినముల యందు ప్రవక్తలు యెరూషలేమునుండి అంతియొకయకు వచ్చిరి. వారిలో అగబు అను ఒకడు నిలవబడి భూలోకమంతట గొప్ప కరవు రాబోవుచున్నదని ఆత్మ ద్వారా సూచించెను. అది క్లౌదియ చక్రవర్తి కాలమందు సంభవించెను. అప్పుడు శిష్యులలో ప్రతివాడును తన శక్తి కొలది యూదయలో కాపురమున్న సహోదరులకు సహాయము పంపుటకు నిశ్చయించుకొనెను. అలాగున చేసి బర్నబా, సౌలు అనువారిచేత పెద్దల యొద్దకు దానిని పంపిరి" (అపొ.కా. 11:27-30).

మాసిదోనియలో యున్న సహోదరుల అవసరాన్ని గమనించారు గనుక తమ సామర్థ్యము కంటె ఎక్కువ ఇయ్యగలిగిరి. "సహోదరులారా, మాసిదోనియ సంఘములకు అనుగ్రహింపబడియున్న దేవుని కృపను మీకు

తెలియజేయు చున్నాము. ఏలాగనగా వారు బహుశ్రమువలన పరీక్షింపబడగా అత్యధికముగా సంతోషించిరి. మరియు వారు నిరుపేదలైనను వారి దాతృత్వము బహుగా విస్తరించెను. ఈ కృప విషయములోను పరిశుద్ధుల కొరకైన పరిచర్యలో పాలుపొందు విషయము లోను మనఃపూర్వకముగా మమ్మును వేడుకొనుచు వారు తమ సామర్థ్యము కొలది యేగాక సామర్థ్యము కంటే ఎక్కువగాను తమంతట తామే యిచ్చిరని మీకు సాక్ష్యమిచ్చుచున్నాను" అని పౌలు చెప్పాడు (2 కొరింధీ 8:1-4).

ప్రభువు పనికి నేడు ధారాళముగా యిచ్చు సహోదరుడు ఆఫ్రికా, ఇండియా, జపాను, చైనా దేశములలో సువార్త యొక్క అవసరాన్ని గుర్తిస్తాడు. సువార్త చాట బడుటకు ధనాన్ని యిస్తాడు. దేవుడు వారిని ఆశీర్వదించిన కొలది సభ్యులందరు ఇచ్చినట్టయితే, మన కాలములోనే ప్రపంచమంతటా సత్యసువార్త చాటబడతాది.

**ఇచ్చుట మన నమ్మకత్వపు పరీక్ష**

యెహోవా దేవుని యందు అతనికున్న నమ్మకమును బట్టి దానియేలు దుష్టమైన రాజాజ్ఞకు లోబడుటకు నిరాకరించాడు. "ఇట్టి శాసనము సంతకము చేయబడెనని దానియేలు తెలిసికొనినను అతడు తన యింటికి వెళ్లియధా ప్రకారముగా అనుదినము ముమ్మారు మోకాళ్లని, తన యింటి పై గది కిటికీలు యెరూషలేము తట్టునకు తెరువబడి యుండగా తన దేవునికి ప్రార్థన చేయుచు స్తుతించుచు వచ్చెను'' (దానియేలు 6:10).

బర్నాబా యేసుకీస్తుకు ఆయన సంఘమునకు నమ్మకముగా యుండెను గనుక తన భూమిని అమ్మి దాని వెలను అపొస్తలుల పాదముల యొద్ద పెట్టెను. "కుప్రలో పుట్టిన లేవీయుడగు యోసేపు అను ఒకడుండెను. ఇతనికి అపొస్తలులు హెచ్చరిక పుత్రుడు అని అర్థమిచ్చు బర్నబా అను పేరుపెట్టి యుండిరి. ఇతడు భూమిగల వాడైయుండి దానిని అమ్మి దాని వెలతెచ్చి అపొస్తలుల పాదముల యొద్ద పెట్టెను" (అపో.కా. 4:36-37).

అననీయ సప్పీరాలకు కూడ భూమి యుండెను. వారు కూడదానిని అమ్మిరి గాని దాని వెల ప్రభువు పనికి యిచ్చే విషయములో అబద్ధమాడిరి. యిచ్చే విషయంలో వారు అబద్ధమాడి నందున ప్రభువు వారిద్దరిని చంపెను (అపో.కా. 5:1-11). యిచ్చుట విషయంలో నేడు అబద్ధమాడుచున్నందున దేవుడు వారిని చంపుతుయుంటే, మన సంఘాలలో పెక్కుమంది నశిస్తారు. యిచ్చుటను గూర్చి మనం దేవుని యొద్ద అబద్ధమాడు చున్నామా? ఆలోచించు కొనుము.

– V.P. బేక్

# ప్రకృతి సూత్రములలో దేవుని ఋజువు

(Evidence of God in Natural Laws)

నిశీధ రాత్రిలో ఆకాశములో యున్న నక్షత్రములను నీవు ఎన్నడైనా గమనించావా? ఈ విశ్వం ఎక్కడ నుండి కలిగినదాయని నీవు ప్రశ్నించుకొన్నావా?

భౌతిక విశ్వంనిత్యమూ వున్నదే యని కొందరు నమ్ముతారు. సర్వం పదార్థమయం, వున్నదంతా పదార్థమే యని వారు నమ్ముదురు. దీనిని భౌతిక వాదం(Materialism) అంటారు. ఈ వేదాంతంలో దేవునికి చోటు లేదు.

అయితే ఈ భౌతిక ప్రపంచానికి ఆది అంటూ ఒకటి యుండెనని బైబిలు చెబుతుంది. " ఆదియందు దేవుడు భూమ్యాకాశములను సృజించెను'' (ఆదికా 1:1). ఈ భౌతిక ప్రపంచము నకు అంతము కూడ యున్నదని బైబిలు చెప్పుచున్నది. "ఆదినమున ఆకాశములు మహాధ్వనితో గతించిపోవును, పంచభూత ములు మిక్కటమైన వేండ్రముతో లయమైపోవును, భూమియు దాని మీద నున్న కృత్యములును కాలిపోవును" (2 పేతురు 3:10). ప్రపంచాన్ని గూర్చిన ఈ రెండు దృక్పథాలలో యేది సరియైనది? భౌతిక ప్రపంచము నిత్యమూవుండేదా? లేక దేవుడు ఒక ప్రణాళిక ప్రకారము సమస్తాన్ని సృజించెనా ?

**థెర్మోడైనమిక్స్ యొక్క మొదటి సూత్రము:**

భౌతిక వాదులు సాధారణముగా థెర్మోడైన మిక్స్‌లోని మొదటిసూత్రన్ని చెప్పి భౌతిక విశ్వం నిత్యమైనదని తలస్తారు. థెర్మో అనగా గ్రీకు భాషలో తాపక (heat) మని, డైనమిక్స్ అనగా శక్తి యని అర్థము. థెర్మోడైనమిక్స్‌లోని మొదటిసూత్రం యేమిచెబుతున్నదంటే, "విశ్వంలోశక్తిని ఒక్క కేలరీ కూడ మనం నాశనం చేయలేము సృజించలేము. ఈ విశ్వంలో యున్న శక్తి యొక్క మొత్తం అంతా ఒకేలాగ యుండును"

ఈ సూత్రాన్ని బట్టి విశ్వం నిత్యమైనదని ఋజువు చేయడానికి భౌతిక వాదులు ప్రయత్నిస్తారు. శక్తిని మనం సృజించలేము, నాశనం చేయలేము గనుక ఈ విశ్వం నిత్యము యున్నదని వారు చెబుతారు. గాని అది యదార్థంకాదు.

అయితే థెర్మోడైనమిక్స్‌లోని మొదటిసూత్రం, విశ్వం నిత్యమైనదని చెప్పుట లేదు. గాని శక్తి పదిలపరచబడు

చున్నదని అది చెప్పుచున్నది. మనం ఎంత గమనించినా ఈ విశ్వంలో యున్న శక్తి యొక్క పరిమాణం మాత్రం మార్చబడుట లేదు.

థెర్మోడైన మిక్స్‌లోని రెండో సూత్రము :

విశ్వంలో యున్న శక్తి యొక్క మొత్తంలో మార్పులేకపోతే మానవులు ఎందువలన శక్తిని కోల్పోవుచున్నారు? మనం ఎందువలన అలసట జెందుచున్నాము? మనం రోజుకు రెండుమూడు సార్లు ఎందుకు ఆహారం భుజించాలి ? రాత్రులందు ఎందుకు నిద్ర పోవాలి? మన టార్చిలైట్‌లలో బేటరీలు ఎందుకు అయిపోతాయి ? పొయ్యిలో అగ్ని ఎందుకు ఆరిపోతాది? ఈ ప్రశ్నలకు థెర్మోడైన మిక్స్‌లో రెండో సూత్రములో మనకు జవాబుదొరకును. అల్బర్ట్ అయిన్‌స్టెయిన్ అనునతడు 20వ శతాబ్దములో ప్రసిద్ధిగాంచిన విజ్ఞాన శాస్త్రవేత్త. అతడు థెర్మోడైనమిక్స్‌లో రెండో సూత్రము "విజ్ఞాన శాస్త్రముల ప్రాముఖ్యసూత్రము" అన్నాడు.

మన విశ్వం ఒక Closed System అంటే అది బాహ్యాశక్తుల వలన ప్రభావితం కాజాలదు. రెండవసూత్ర ప్రకారము విశ్వంలో యున్నప్రతీది క్రమప్రకారముండని స్థితికి చలించుచున్నది (Every thing is moving toward a state of disorder)యని చెప్పుచున్నది. విశ్వంలో యున్న శక్తియొక్క పరిమాణము (Quantity) సమానమే అయినా, ఆశక్తి యొక్క ప్రభావము (Quality) క్షీణిస్తుయున్నది. ప్రయోజనకారియగు శక్తి యొక్క మొత్తము క్షీణించుచున్నది. అది వినియోగించబడిపోతుంది.

మన విశ్వం ఒక క్రమస్థితి నుండి క్రమములేని స్థితికి పయనించుచున్నది. క్రమములేని స్థితికి పోవుచు, శక్తిని కోల్పోవు చున్నందున దీనిని ఎంట్రోపి (entropy) యందురు. ఎంట్రోపి ఎల్లప్పుడు క్రమములేని స్థితి వైపే పోవును గాని దానికి భిన్నముగా కాదు.

ఉదాహరణకు ఒకావె బ్యూటిక్లినిక్‌కు వెళ్లి తన తలవెంట్రుకలను అందముగా అలంకరించుకొన్నాదను కొందాము. ఆమె తలను దువ్వుకొనకుండా ఒక సంవత్సరము మట్టుకు ఏదో కర్మాగారములో పనిచేసినద నుకొందాము. అప్పటికి ఆమె తలవెంట్రుకలు క్రమ పద్ధతిగానున్న స్థితినుండి క్రమముగాలేని స్థితికి పోవును.

థెర్మోడైనమిక్స్‌లోని రెండవ సూత్రము ఈ లోకములో మనం గమనించ వచ్చును. లోహములు తుప్పుపట్టును, మాంసములు కుళ్లపట్టును, పాలు విరిగిపోవును, వేడిగా యున్నవి చల్లగానగును. మానవ

శరీరము పెరిగి, చనిపోవును. ఒక కారును 20 సంవత్సరముల మట్టుకు, శుభ్రము చేయ కుండా, ఇంజన్ స్టార్ట్ చేయకుండా ఉంచితే ఎట్లుండును? అది పనికి మాలిన స్థితికి చేరుకొనును.

ఈ సూత్రము అకాశములలో కూడ మనం గమనించవచ్చును. ప్రతి నక్షత్రములోను సెకనుకు బిలియన్ల టన్నుల శక్తి వినియోగించబడుచు యున్నది. మన సూర్యుడు తనలోని శక్తిని సగము మట్టుకు అప్పుడే వినియోగించేసాడని శాస్త్రజ్ఞులు చెబుతున్నారు. ఆదిలో దానిలో యున్న హైడ్రొజన్‌లో సగం కాల్చి వేయబడింది.

సూర్యుడు తన ఇంధనమునుతోనే మండుచున్న ఒక బ్రహ్మాండమైన అగ్నిగోళము. ప్రతీసెకనుకు 661 మిలియన్ల హైడ్రొజన్ అణువులు ఒకదానితో నొకటి కలిసి బంధింపబడి 657 మిలియన్‌టన్నుల హీలియంను తయారు చేయును. హైడ్రొజన్ ఇంధనము, హీలియం బుగ్గి. ఈ సమ్మేళనము వలన ప్రతిసెకనుకు 4మిలియన్ టన్నుల శక్తి, ఎలక్ట్రో మేగ్నిటిక్ రేడియేషన్ రూపముగా విడుదలయై మనకు ఉష్ణోగ్రతగాను, వెలుగుగాను లభించుచున్నది.

సూర్యుడు తనలోని ఇంధనాన్ని క్రమేపి కాల్చివేయుచున్నాడు. అందువలన సూర్యుడు, నక్షత్రములు కూడ చివరకు తాపక మరణము (heat death) ననుభవించును, కాల్చుటకు వాటిలో ఇంధనముండదు గనుక వాటిమంటలు చల్లారిపోవును.

వెలుగుచున్న క్రొవ్వొత్తిని పట్టుకొని యున్న ఒకని చూచి ఎంతకాలము నుండి ఆక్రొవ్వొత్తి వెలుగు చున్నదని నీవు ప్రశ్నిస్తే అతడు నిత్యము నుండి అది వెలుగుచున్నదని జవాబిస్తే, నీ వేమనుకొంటావు ? యేమి తలస్తావు? బహుశ ఆ జవాబును బట్టి నీవు నవ్వుకోవచ్చు. ఒక క్రొవ్వొత్తి నిత్యము వెలుగుచు యుండుట అసంభవము.

సూర్యుడు, నక్షత్రములు కూడ బ్రహ్మాండమైన క్రొవ్వొత్తులే, అవి వాటిలోని ఇంధనాన్ని ఉపయోగించేస్తున్నాయి. ఈ విశ్వం గనుక నిత్యమైనదయితే నక్షత్రములు తమలోని హైడ్రొజన్‌ను ఎప్పుడో వాడేసుకొని యుండును. అవి తాపక మరణాన్ని అనుభవించియుండును. ఈ విశ్వమంతయు అతిశీతలముగాను గాఢాంధకారములోను ఉండి యుండును.

**అణుధార్మిక పదార్థములు : (Radio active Materials:)**

థర్మోడైనమిక్స్‌లోని రెండవ సూత్రము రేడియో ఏక్టివ్ పదార్థములలో కనబడును. యురేనియం లాంటి

రేడియో ఏక్టివ్ పదార్థములు తమలోని శక్తిని రేడియేషన్ వలన కోల్పోవుచున్నవి, యురేనియం తనలోని శక్తిని కోల్పోవు నప్పుడు సీసముగా తయారగును. ఈ విశ్వం గనుక నిత్యమైన దయితే ఏవిధమైన రేడియో ఏక్టివ్ పదార్థములు ఇకవుండవు.

ఈ విశ్వం నిత్యము వుండునది కాదు. బైబిలు చెప్పునట్లుగా దానికొక ఆదియున్నది అంతము కూడా యున్నది.

**జీవనోత్పత్తి సూత్రము** (The Law of bio genesis).

బైబిలు చెప్పుసృష్టి క్రమమును బలపరచు మరియొక విజ్ఞానశాస్త్ర సూత్రము ఇంకొకటికలదు. అది జీవము నుండి యే జీవముద్భవించునని ఈ సూత్రము చెప్పుచున్నది. నిర్జీవ పదార్థము నుండి జీవముద్భవించదు.

నిర్జీవ పదార్థముల నుండి జీవముద్భవింపజేయడానికి శాస్త్రజ్ఞులు వందలాది సంవత్సరములనుండి ప్రయత్నము చేయుచున్నారు. గాని వారి ప్రయత్నములన్నియు విఫలమయ్యాయి, నిర్జీవ వస్తువులనుండి జీవముద్భవించదు. జీవమునుండి జీవము కలుగును. నిజానికి జీవమంతా సజీవుడైన దేవుని నుండి కలుగును.

**ముగింపు :**

భౌతికవాదం ఈ విశ్వం నిత్యం అని చెప్పుచున్నది. థెర్మోడైనమిక్స్‌లోని రెండవ సూత్ర ప్రకారము ఈ విశ్వం నిత్యం కాదు. గనుక భౌతికవాదం విజ్ఞానశాస్త్ర వ్యతిరేకం, అది వాడుకలో లేని, కాలంచెల్లిన 19వశతాబ్ధపు వేదాంతం. భౌతికవాదం ఒక మిధ్యయే.

ఈ విశ్వానికి ఒక ఆదియున్నది, ఎంట్రోపి సిద్ధాంత ప్రకారము విశ్వంలో యున్న పదార్థము క్షీణించిపోవుచున్నది, అది పరిణామము జెందుటలేదు. అచేతనంగా యున్న పదార్థము ఒక క్రమాన్ని కలుగజేయలేదు. జ్ఞానం మాత్రమే క్రమమును కలుగజేయును. ఈ విశ్వంలో కనబడు క్రమమంతయు అత్యున్నత జ్ఞానియైన దేవుని వలన కలిగెనని బైబిలు చెప్పుచున్నది.

ఈ విశ్వం ఏలాగుకలిగింది? థెర్మోడైనమిక్స్‌లోని మొదటిసిద్ధాంతప్రకారము పదార్థమును సృజింపజాలము. నశింపచేయుజాలము. అంటే ఈ విశ్వానికి అతీతముగా యున్న శక్తి వలన/ద్వారా ఈ విశ్వం సృజింపబడెనని దానియర్థం. గనుక ఈ విశ్వానికి కారకుడొకడున్నాడు. బైబిలు ఆయనను దేవుడని చెబుచున్నది. ఈ విశ్వం ఒక బ్రహ్మాండమైన గొప్ప విస్ఫోటము వలన (Big Bang) కలిగినదని అనేక శాస్త్రజ్ఞులు నమ్ముదురు. అంతేకాదు ఉనికి కలిగి యున్న దేదయినను దానికి కారకుడొకడున్నాడని వారునమ్ముదురు.

ఈవిశ్వానికొక ఆదియున్నది. గనుక విశ్వానికొక కారకుడున్నాడు, ఆయనను దేవుడని బైబిలు చెప్పుచున్నది. "ఆదియందు దేవుడు భూమ్యాకాశములను సృజించెను" (ఆది 1:1). "ఆయన తన బలముచేత భూమిని సృష్టించెను. తనజ్ఞానము చేత ప్రపంచమును స్థాపించెను. తన ప్రజ్ఞచేత ఆకాశమును విశాలపరచెను'' (యిర్మియా 10:12). "యెహోవా వాక్కు చేత ఆకాశములు కలిగెను, ఆయన నోటి ఊపిరిచేత వాటి సర్వసమూహము కలిగెను " (కీర్తన 33:6).

"ప్రపంచములు దేవుని వాక్యము వలన నిర్మాణమైనవనియు అందును బట్టి దృశ్యమైనది కనబడెడు పదార్థములచే నిర్మంపబడలేదనియు విశ్వాసము చేత గ్రహించుకొను చున్నాము" (హెబ్రీ 11:3). దేవుడు ఈ విశ్వాన్నంతటినీ తనమాటచేత సృజించారు.

ఈ విశ్వం దానంతట అదే కలిగెనని నమ్ముటకంటే సర్వజ్ఞానియు, సర్వశక్తి మంతుడైన దేవునిచే అది సృష్టింపబడెనని విశ్వసించుట జ్ఞానయుక్తము. ఏదైనా దానికదే ఎట్లు సృష్టించుకోగలదు?.

## వారు ఆయనను గుర్తించిరి

(And They recognised Him)

ఈ ప్రపంచములోని మానవుల నందరిని రక్షించుటకు గాను దేవుని కుమారుడు మానవునిగా ఈ భూలోకములో జన్మించెను. ఆయనను వెంబడించిన వారు ఆయనను సర్వోన్నతుడైన దేవుని కుమారునిగా గుర్తించిరి. కొంత మంది ఆయన యందు విశ్వాసముంచిరి. మరికొంతమంది ఆయనను నిరాకరించిరి. కన్యయైన మరియ గర్భమందు ఆయన జన్మించెను. యేసు ఈ భూలోకములో మానవునిగా జన్మించినది మొదలు యోసేపు, మరియలు ఆయనను దేవుని కుమారునిగ గుర్తించిరి.

"భయపడకుడి; ఇదిగో ప్రజలందరికిని కలుగబోవు మహాసంతోషకరమైన సువార్త మానము నేను మీకుతెలియజేయు చున్నాను. దావీదు పట్టణమందు మీ కొరకు నేడు రక్షకుడు పుట్టియున్నాడు; ఈయన ప్రభువైన క్రీస్తు" (లూకా 2: 10-13). అని పరలోక దూతలు గొల్లలకు క్రీస్తు జననమును గూర్చి తెలియపరచిరి. ఆ గొల్లల కాపరులు బెత్లెహేముకు వెళ్లి తొట్టిలో

పండుకొని యున్న శిశువును చూచిరి. ఆయన యొక్క ఏకైక కుమారుని ఈ లోకములోనికి పంపించినందుకు గాను దేవుని మహిమ పరచుచు, ఆయనను ఘనపరచుచువారు తిరిగి వెళ్లిరి. (లూకా 2:20). జ్ఞానులు ఆకాశమందు తూర్పు దిక్కున నక్షత్రమును చూచి దానిని వెంబడించగా, ఆ నక్షత్రము వారి ముందు నడచుచూ ఆశిశువు ఉన్న చోటికి వచ్చి, అచ్చట నిలువగా వారు ఆశిశువును చూచి, ఆ బిడ్డ యేసు అని గుర్తించి అత్యానంద భరితులై ఆయనను పూజించి ఆయనకు బంగారు, సాంబ్రాణి, బోళము కానుకలుగ అర్పించిరి.

యేసు బాప్తిస్మము కొరకు బాప్తిస్మమిచ్చు యోహాను దగ్గరకు వచ్చినపుడు, పరిశుద్ధాత్మ పావురము వలె ఆయన మీదికి దిగి వచ్చుట చూచి యోహాను ఆయనను యేసు అని గుర్తించెను. "నేను ఆయనను ఎరుగ నైతిని. నీళ్లలో బాప్తిస్మమిచ్చుటకు నన్ను పంపిన వాడు నీవు ఎవరి మీదికి ఆత్మదిగి వచ్చి నిలుచుట చూతువో ఆయన పరిశుద్ధాత్మలో బాప్తిస్మమిచ్చు వాడని చెప్పెను" అని యోహాను యేసును గూర్చి సాక్షము చెప్పెను. (యోహాను 1: 33-34).

శిష్యులు వారి కుటుంబము లను, వారి వృత్తిని విడిచిపెట్టి యేసును వెంబడించిరి. పేతురు యేసుతో ఈ రీతిగ చెప్పెను: "ప్రభువా యెవని యొద్దకు మేము వెళ్లుదుము ? నీవే నిత్య జీవపు మాటలు గల వాడవు, నీవే దేవుని పరిశుద్ధుడు వని మేము విశ్వసించి ఎరిగి యున్నామని ఆయనతో చెప్పెను" (యోహాను 6:68). జనసమూహములు రోగములనుండి విముక్తులుగా చేయబడుట ద్వారాను, అనేకములైన సూచకక్రియలు, అద్భుతకార్యములు చూచుట ద్వారాను, తృప్తికరముగ భోజనము చేయుట ద్వారాను ఆయనను దేవుని కుమారునిగ గుర్తించిరి. దయ్యములు కూడ ఆయనను దేవుని కుమారునిగ గుర్తించినవి. అపవిత్రాత్మ యేసును చూచి, "యేసూ ! సర్వోన్నతుడైన దేవుని కుమారుడా, నాతో నీకేమి? నన్ను బాధపరచకుమని దేవుని పేరట నీకు ఆనబెట్టుచున్నానని చెప్పెను" (మార్కు 5:7; అ.కా. 19:13-18). నజరేతు వారు ఆయనను మరియ, యోసేపుల కుమారునిగ గుర్తించి వారి హృదయములను కఠిన పరచుకొనిరి (మత్తయి 13:54-58).

బాప్తిస్మమిచ్చు యోహాను తన శిష్యులలో ఇద్దరికి యేసును చూపించి, ఇదిగో దేవుని గొఱ్ఱెపిల్ల అని వారికి యేసును పరిచయము చేసెను (యోహాను 1:36). ఆశిష్యులిరువురును ఆయన

యుండు స్థలము వరకు ఆయనను వెంబడించి ఆయనతో వెళ్లిరి. ఆ దినము వారు ఆయనతో అచ్చట గడిపిరి. వారిలో ఒకడు అంద్రెయ. ఇతడు తన సహోదరుడైన సీమోనును చూచి, మేము మెస్సీయను కనుగొంటిమి అని అతనితో చెప్పి అతనిని యేసు నొద్దకు తోడుకొని వచ్చెను(యోహాను 1:41-42). మరునాడు ఆయన ఫిలిప్పును కనుగొని, నన్ను వెంబడించుమని చెప్పెను. ఫిలిప్పు నతనియేలును కనుగొని ధర్మశాస్త్రములో మోషేయు, ప్రవక్తలును యెవరిని గూర్చి వ్రాసిరో ఆయనను కనుగొంటిమి; ఆయన యోసేపు కుమారుడైన నజరేయుడగు యేసు అని చెప్పెను (యోహాను 1:43-45). ఫిలిప్పు నతనియేలును యేసు నొద్దకు తీసికొని వచ్చెను.

యోహాను సువార్త 4వ అధ్యాయములో యాకోబు బావి యొద్దకు నీళ్లు చేదుకొనుటకు వచ్చిన సమరయస్త్రీ మెస్సీయ ఈ లోకమునకు వచ్చునని తెలిసికొనినది. నీతో మాట్లాడు చున్న నేనే ఆయనననని యేసు తన్ను ఆమెకు తెలియపరచుకొనెను (యోహాను 4:36). ఆస్త్రీ ఆమె కుండను బావిదగ్గరనే విడిచిపెట్టి, ఊరిలోనికి వెళ్లి, మీరు వచ్చి నేను చేసిన వన్నియు నాతో చెప్పిన వానిని చూడుడి. ఆయన క్రీస్తు కాడా? అని ఆ ఊరివారితో చెప్పెను. అప్పుడు ఆ ఊరివారు ఆయన దగ్గరకు వచ్చి నేను చేసినవన్నియు నాతో చెప్పెనని సాక్ష్యమిచ్చిన స్త్రీ యొక్కమాటను బట్టి ఆఊరిలోని సమరయులలో అనేకులు ఆయన యందు విశ్వాసముంచిరి (యోహాను 4:28-30; 39-42).

ఐదు రొట్టెలు, రెండు చేపలతో జన సమూహమునకు భోజనము పెట్టినతరువాత యేసు ప్రార్థనచేయుటకు కొండకు వెళ్లెను. శిష్యులు దోనెయెక్కి ముందుగా వెళ్లిరి. రాత్రి నాలుగవ జామున యేసు సముద్రము మీద నడచుచు వారి యొద్దకు వచ్చెను. గాలి ఎదురైై సముద్రము మీద అలలులేచుచున్నందున నావకు ఎంతో తొందరకలుగుచుండెను. యేసు ఆ దోనె దగ్గరకు రాగానే గాలి అణగి, సముద్రమునిమ్మళమాయెను. దోనెలో యున్నవారు వచ్చి, నీవు నిజముగ దేవుని కుమారుడవని చెప్పి ఆయనకు మ్రొక్కిరి. వారు అద్దరికి వెళ్లి గెన్నెసరతు దేశమునకు వచ్చిరి. అచ్చటి జనులు ఆయనను గుర్తుపట్టి, చుట్టుపట్లనున్న ప్రదేశముల కంతటికి వర్తమానము పంపి, రోగులనందరిని ఆయన యొద్దకు తెప్పించిరి. ఆయన వారి నందరిని స్వస్థపరచెను (మత్తయి 14:22-36). వారు దోనె దిగగానే జనులు ఆయనను గుర్తు పట్టి ఆప్రదేశమందంతట

పరుగెత్తికొని పోయి, ఆయన యుండిన స్థలమునకు రోగులను మంచముల మీద మోసికొని వచ్చుటకు మొదలు పెట్టిరి. (మార్కు 6:53). గెన్నెసరతు ప్రజలు మన ప్రభువైన యేసును గుర్తించినపుడు ఆయనను గూర్చిన మంచివార్త అందరికి తెలియువరచుట కొరకు వారు పరుగులెత్తిరి. (మార్కు 6:55).

ఆదినములలో వార్తా పత్రికలు గాని, రేడియోలు, టెలివిజన్‌లు, టెలిఫోన్లుగాని వార్తలు తెలియబరచుటకు లేవు. నోటి మాట ద్వారానే వార్తలు వెల్లడించబడేవి. యేసును ఎరిగినవారందరు ఇతరులను యేసు నొద్దకు తీసుకు వచ్చేవారు, గొఱ్ఱెల కాపరులు యేసును కనుగొనిన తరువాత ఆయనను పూజించిరి. జ్ఞానులు వచ్చి యేసును చూచిన తరువాత వారు సాగిల పడి నమస్కరించి విలువైన కానుకలను ఆయనకు సమర్పించిరి. శిష్యులు ఆయనను గుర్తించి ఆయనను వెంబడించిరి. వారి ద్వారానే సువార్త ప్రపంచ మంతటికిని వ్యాప్తిచెందెను. అంద్రెయ సీమోను పేతురును యేసు నొద్దకు నడిపించెను. అతడు యేసు కొరకు గొప్పయోధుడయ్యెను.

ఫిలిప్పు నతనియేలును యేసు నొద్దకు తీసికొని వచ్చెను. తాను యేసు కొరకు గొప్ప అపొస్తలుడయ్యెను. సమరయస్త్రీ ద్వారా సుకారు అను గ్రామములోని అనేక మంది యేసునందు విశ్వాస ముంచిరి. గెన్నెసరతు ప్రజలు ఆయనను గుర్తించి, వారు పరుగెత్తి అనేక గ్రామములకు వెళ్ళి రోగుల నెల్లను ఆయన యొద్దకు తీసుకు వచ్చిరి. ఆయన వారినందరిని స్వస్థపరచెను. వారందరు ఆయన దేవుని కుమారుడని గుర్తించిరి.

నేను ఆయననని మీరు విశ్వసించని యెడల మీరు మీ పాపములలోనే యుండి మరణింతురు అని యేసు చెప్పెను (యోహాను 8:24) ఆయన దేవుని కుమారుడని మనము విశ్వసించని యెడల మనము మన పాపములలోనే యుండి చనిపోవు దుము. యింకను అనేక మంది ఆయన దేవుని కుమారుడని గుర్తించిరి. వారు యేసు నొద్దకు అనేకులను తీసుకు వచ్చిరి. యేసు దేవుని కుమారుడని నీవు గుర్తించిన యెడల యెప్పుడైనా, ఎవరికైనా ఆయన దేవుని కుమారుడని నీవు చెప్పితివా? ఎవరినైనా ఆయన యొద్దకు తీసికొనివచ్చితివా? ఆయన సంఘములో ఎవరినైనా చేర్చితివా?

నీవు నిజముగా యేసు దేవుని కుమారుడని గ్రహించి, నీవు ఆయనను గుర్తించితివా? ఆయన పరిశుద్ధ సహవాసము లోనికి ఎవరినైనా చేర్చితివా?.

– కవిత గూటం

# అతి కఠినమైన ఆజ్ఞ
(The Hardest Command)

వరలోకం నుండి వచ్చిన అత్యంత కఠినమైన ఆజ్ఞ ఏది? బాప్తిస్మమా? ప్రభు రాత్రి భోజనమా? నమ్మకమైన క్రైస్తవ జీవితం జీవించడమా? ఈ ఒక్కొక్కదానికి కాదు అని మనం జవాబీయవలసి వస్తాది. నిస్సందేహంగా దేవుని వాక్యంలో యున్న అతికఠినమైన ఆజ్ఞ మారుమనస్సు. లూకా 13:3లో అది సూక్ష్మంగా ఇట్లు చెప్పబడింది : "మీరు మారుమనస్సు పొందని యెడల మీరందరును ఆలాగే నశింతురు."

ఈ యాజ్ఞ ఒకని అహంను ఉద్దేశించి చెప్పబడింది గనుక యిది కష్టమైనదిగా కనబడత్తాది. మన శరీరాలను మనం లొంగదీసికోవాలి. ఈ శరీరాన్ని దాని యిచ్ఛలతోను, దురాశల తోను సిలువ వేయాలి. అయితే వీటిని చేయడానికి మానవజాతిలో పెక్కుమంది మాత్రం యిష్టపడుటలేదు. అవును, మనం అసాధ్యమైన అనేక సంగతులను చేసాం; వివిధ గ్రహాలమధ్య నున్న దూరాన్ని కనుగొన్నాం, చంద్రమండ లంపైకి వెళ్లి తిరిగి రాగలిగే యంత్రాన్ని కనుగొన్నాం గాని ఈ యాజ్ఞను మాత్రం పాటించలేకపోయాం.

ఈ యాజ్ఞలో యున్న కష్టం బైబిలునందలి ఉదాహరణలో కూడా మనకు కనబడుచున్నది. నోవహు నీతిని బోధించాడుగాని తన కాలమునాటి దుష్టలోకం మారుమనస్సు నొందునట్లు చేయలేక పోయాడు. హేరోదుకును హేరోదియకును మారుమనస్సు గూర్చి బోధించుటవలన బాప్తిస్మమిచ్చు యోహాను శిరచ్ఛేదనము చేయబడ్డాడు. యేసు తన కాలమునాటి కొన్ని పట్టణాలు మారుమనస్సు పొందునట్లు చేయలేక పోయారు. ఫేలిక్సు మారుమనస్సు పొందునట్లు పౌలు చేయలేకపోయాడు. అవును, పాటించడానికి నిజంగా మారుమనస్సు ఒక కఠినమైన ఆజ్ఞే,అది కష్టతరమైన దయినాసరే, మానవులు పాపం చేసినప్పుడు మారుమనస్సు పొందాలని అన్ని కాలాల్లోను దేవుడు ఆజ్ఞాపించారు. హనోకు మారుమనస్సును ప్రకటించాడు. నోవహు మారుమనస్సు ప్రకటించిన దేవుని వక్త. ప్రవక్తలు మారుమనస్సును ప్రకటించారు. ఇప్పుడు పాపులందరు మారుమనస్సును పొందాలని దేవుడు ఆదేశించుచున్నారు (అపొ.కా. 17:30; 2 పేతురు 3:9).నీవు అపనమ్మకముగా యున్న దేవుని బిడ్డవైతే, తప్పక మారుమనస్సు పొందాలి

(అపో.కా. 8:22). ఒక్కోసారి సంఘ మంతా మోకాళ్లపైబడి మారుమనస్సు పొందాల్సిన అవసరం వస్తాది (ప్రకటన 3:15-16). మారుమనస్సు నొంద నిరాకరించువారు తమపై దేవుని ఉగ్రతను తామే సమకూర్చు కొందురు (రోమా 2:5).

మారు మనస్సులో ఒకని చిత్తం మారతాది; తత్ఫలితంగా ప్రవర్తన మారతాది (మత్త 21:28-31). దుర్మార్గతనుండి తొలగి పోవుట మారుమనస్సు(యోనా 3:10). గనుక మారుమనస్సు పొందాల్సిన అవసరం నీకుంటే, ఈరోజే మారుమనస్సు పొంది దేవుని దూతల మధ్య ఆనందాన్ని కలుగ జేయువా ? ఇదిగో ఇప్పుడే అనుకూల సమయం, ఇదే రక్షణదినము.

- డాన్ డీఫెన్సో

## జ్యోతిషము : తప్పా ? కాదా

(Astrology : Right or wrong?)

గ్రహచలనము వలన మానవ జాతిపైకలుగు ప్రభావమును, భవిష్యత్తులో జరిగే సంఘటనలను చెప్పే అసత్య జ్ఞానాన్ని జ్యోతిషం అని మనం చెప్పుకోవచ్చు. జ్యోతిషాన్ని అనుసరిస్తు ఒకడు దేవుని సేవించలేడు. ఈ దిగువ కారణాలను పరీక్షించు:

1. అది నిషేధించబడిన జ్ఞానాన్ని వెదుకుతుంది. "రహస్యములు మన దేవుడైన యెహోవాకు చెందును. అయితే ... బయలుపరచబడినవి యెల్లప్పుడు మనవియు మన సంతతి వారివియునగును" (ద్వితీ 29:29). భవిష్యజ్ఞానమును ప్రభువు తన యొద్దనే ఉంచుకొన్నాడు. "కాలములను సమయములను తండ్రి తన స్వాధీన మందుంచుకొని యున్నాడు; వాటిని తెలిసికొనుట మీ పనికాదు" (అపో.కా. 1:7).

2. అది విగ్రహారాధనతో ఆరంభమైనది. అన్యదేవతలకు, అనగా సూర్యునికైనను చంద్రునికైనను ఆకాశనక్షత్రములలోని దేనికైనను నమస్కరించి ఆరాధించుటను దేవుడు నిషేధించారు. అది హేయకరము(ద్వితీ 17:2-4). మోషే చట్టప్రకారము వాటి నారాధించువారు మరణశిక్షకు పాత్రులు.

అది పాడుచేయు గుణముకలది. యెహోవా సెలవిచ్చు చున్న దేమనగా - అన్యజనముల ఆచారముల నభ్యసింప కుడి. ఆకాశమందు అగపడు చిహ్నములకు జనములు భయపడును. అయితే మీరు వాటికి భయపడకుడి" (యిర్మీయా 10:2).

4. అది పనికిమాలినది. "యెహోవానగు నేనే సమస్తమును జరిగించువాడను. నేనొకడనే ఆకాశమును విశాలపరచిన వాడను. నేనే భూమిని పరచినవాడను. ప్రగల్భుల ప్రవచనములను వ్యర్థము చేయువాడను, సోదెగాండ్రను వెర్రివానిగా చేయువాడను, జ్ఞానులను వెనుకకు త్రిప్పి వారివిద్యను అవిద్యగా చేయువాడనునేనే" (యెషయా 44:24-25).

5. అది నిష్ఫలమైనది. దేవుడిట్లు సవాలు చేయుచున్నారు: "జ్యోతిష్కులు, నక్షత్రసూచకులు, మాసచర్య చెప్పువారు నిలువబడి నీమీదికివచ్చునవి రాకుండ నిన్ను తప్పించుదు రేమో ఆలోచించుము. వారు కొయ్యకాలువలెనైరి. అగ్ని వారిని కాల్చి వేయుచున్నది. జ్వాలల యొక్క బలమునుండి తమ్మునుతాము తప్పించుకొన లేక యున్నారు" (యెషయా 47:13,14).

లేఖనములు మన జీవనమునకును భక్తికిని కావలసినవాటి నన్నిటిని దయచేయుచున్నవి (2 పేతురు 1:3). ప్రార్థన ద్వారా మనం దేవుని సహాయాన్ని అడుగవచ్చు. జ్యోతిషముతో సహా ప్రతివిధమైన కీడునకు మనం దూరముగా యుండాలి (1థెస్స 5:22).

-జాన్ వాడీ

## మూడవ దశాబ్ధములో సత్యవాక్కు

మీ చేతిలో యున్న సంచికతో సత్యవాక్కు 3వ దశాబ్ధములోనికి అడుగిడుచున్నది. గత29 సంవత్సరములు విజయవంతముగా నిరాటంకముగా ఈ పత్రికను నడిపించిన దేవునికి స్తోత్రములు. ఇప్పుడు యిది 30వ సంవత్సరములో అడుగిడినది.

సత్యవాక్కు ద్వారా క్రైస్తవ లోకానికి దేవుని సత్యవాక్కును ఉన్నది ఉన్నట్లుగా ఉపదేశించుటకు ప్రయత్నించాము. సంఘాలకు, బోధకులకు, సామాన్య క్రైస్తవులకు కూడ అది ఉపయోగకారిగా యున్నందున దేవునిస్తుతించుచున్నాము.

సత్యవాక్కు ద్వారా చదువరులకు లభ్యముకాని అనేక గ్రంధాలను, వ్యాసాలను, ప్రసంగ మాలికలను అందజేయ గలగాము. అందులో ప్రకటన గ్రంధ ప్రసంగమాలిక ఒకటి. వాక్యాను సారముగా ఇచ్చుటకు గూర్చి బోధించు ' సాక్షిగాతుప్పు ' అనునది మరొకటి. ఇవి ఉదాహరణలు మాత్రమే, ఈ సంచికతో క్రైస్తవ రుజువులు అను మరొక శీర్షికను ప్రారంభించుచున్నాము. యివి ప్రాముఖ్యాంశములు గనుక ప్రతి సంచిక చదివిన తరువాత పదిలపరచుకొన మనవి.

సత్యవాక్కు ఇప్పుడు పదకొండు వేలకు పైగా గృహాలకు ప్రతినెల అందజేయబడుచున్నది. ఇంకను అనేక మంది దానిని కోరుచున్నారు. గాని ఆర్థిక వనరుల లేమి వలన అందజేయలేక పోవుచున్నాము, సత్యవాక్కును చదివే ప్రతి వ్యక్తి పై దీనిని పోషించే బాధ్యత యున్నది. పేపరు, ప్రింటింగ్, పోస్టేజీలు గత 29 సంవత్సరాల్లో పలురెట్లు పెరిగినా, సత్యవాక్కు సాలుచందా మాత్రం 50/- రూ॥లకే పరిమితం చేసాము. అయినను విచారం యేమంటే కనీసం ఆరువేలమంది తమ బాధ్యతను విస్మరించారు గాని వారే ఈ పత్రిక అందకపోతే గోలపెట్టే వారిలో మొదట ఉంటారు. తదుపరి ఏరకమైన సాలుచందా చెల్లించకుండా గత 29 సంవత్సరాలుగా సత్యవాక్కును పొందుచున్నవారు కూడ యున్నారు. వారిలో ఎక్కువ మంది క్రీస్తు సంఘస్థులే, మరియు వారిలో భోధకులే ఎక్కువ. అది మహా శోచనీయం.

మీకు సత్యవాక్కు అందుచున్నను, దానిని మీరు చదువకుండా మూలన పడవేసే కోవకు చెందినవారైతే మాకు దయచేసి ఒక కార్డు వ్రాస్తే, వెంటనే దానిని నిలిపి వేస్తాం వేరొకరికి అందజేస్తాం. ఆసక్తితో చదువుచున్నవారైతే మీకనీస బాధ్యతను గుర్తించండి, ఆర్థిక చేయూతనియ్యండి.

ఈ మూడవ దశాబ్ధమంతా సత్యవాక్కు నిరాటంకముగా ప్రచురింపబడాలని, అనేక ఆత్మలను క్రీస్తు కొరకు ఆకర్షించుట యేగాక, వారిని విశ్వాసములో బలపరచు సాధనముగా యిది వాడబడాలని మాకాంక్ష ఇందు విషయమైన మా ప్రయత్నాలను, మీ ప్రార్థనల సహకారాన్ని దేవుడు దీవించునుగాక !

- ఎడిటర్

# తిరిగి లేచిన మృతులు

దైవజనుడు ఏలీయా కాలమున ఒక విధవరాలి కుమారుడు చనిపోయెను. వారు సీదోను పట్టణమునకు చేరువ గ్రామమైన సారెపతు నివాసులు. ఏలీయా ప్రవక్త ప్రార్థనను దేవుడాలకించి మరణించిన వానికి తిరిగి ప్రాణమిచ్చెను - కాగా ఆ సారెపతు స్త్రీ దేవుని వాక్కు సత్యమని చాటెను (1 రాజులు 17:8-24).షునేమీయురాలయిన ఘనత వహించిన ఒక స్త్రీ గొడ్రాలు. దైవజనుడయిన ఎలీషా ఆశీర్వాదముతో ఆమెకు జన్మించిన కుమారుడు కొలది కాలమునకు మరణించెను. పిలుపుమేర భక్తుడైన ఎలీషా బాలుని శవమున్న గదిలోనికి ప్రవేశించి తలుపువేసి యెహోవాకు ప్రార్థించగా బిడ్డ యేడు మారులు తుమ్మి కండ్లు తెరచిన వాడై మరల బ్రతికెను - తల్లి లోపలికి వచ్చి ప్రవక్త కాళ్ళమీద సాష్టాంగపడి లేచి తన కుమారుని ఎత్తుకొని పోయెను (2 రాజులు 4:32 - 37). మరియు ఎలీషా మృతి పొంది యేడాది గడచిన పిదప మోయాబీయుల సైన్యమునకు భయపడిన కొందరు ఒక శవమును ఎలీషా సమాధిలో ఉంచిరి అది ప్రవక్త శల్యములకు తగలగా మృతుడు బ్రతికి కాళ్లు మోపి నిలిచెను (2 రాజులు 13:21).

క్రొత్త నిబంధన కాలములో ఒక అధికారి యేసు నొద్దకు వచ్చి తన కుమార్తె చనిపోయినదనియు వెంటనే యేసు వారింటికి వచ్చి శవముపై చేయివుంచిన యెడల ఆమె బ్రతుకునని చెప్పెను. అతని నమ్మకము చొప్పున యేసువెళ్ళి మృతురాలి చేయిపట్టు కొనగా ఆ చిన్నది లేచెను (మత్తయి 9:25). క్రీస్తు సిలువ మరణ సమయాన సమాధులు తెరువబడి చాలమందికి కనిపించిరి (మత్తయి 27:52,53). మరియు ప్రభువయిన క్రీస్తు యేసు మృతులలోనుండి లేపబడెను (మత్తయి 25:1-10).

నాయీనను ఒక ఊరిలో యేసు వెళ్లు త్రోవలో ఒక శవము వెలుపలికి మోసికొని పోబడుచుండెను. అది ఒక విధవరాలి ఏకైక కుమారునిది. జనుల మధ్య యేసు అచటికి వచ్చి ఏడువ వద్దని ఆమెతో చెప్పి పాడెను ముట్టి, "చిన్నవాడా, లెమ్మని నీతో చెప్పుచున్నాన"నగా మృతుడు లేచి కూర్చొని మాటలాడ సాగెను. యేసు వానిని తన తల్లికి అప్పగించెను (లూకా 7:11-17). యెరూషలేముకు సమీప గ్రామముమైన బేతనియలో మరియ, మార్తల సోదరుడైన లాజరు రోగియై మరణించెను అతని శవము నాలుగు రోజులుగా సమాధిలో ఉంచబడినను యేసు తన శిష్యులతో అచటికి వచ్చి "లాజరూ, బయటికి రమ్మ"ని బిగ్గరగా చెప్పగా అతడు బ్రతికి సమాధి నుండి వెలుపలికి వచ్చెను (యోహాను 11:23-44).

యొప్పే అను గ్రామములో సత్క్రియలు, ధర్మ కార్యములు బహుగా చేసిన తబితా అను భక్తురాలు కాయిలాపడి చనిపోయెను. తబితాను మరొక భాషలో దొర్కా అని పిలుతురు ('దొర్కా' అనగా లేడి అని అర్థము). ఆమె అంగీలు మొదలగు వస్త్రములను కుట్టెడిది. కబురు అందగానే అపొస్తలుడైన పేతురు అక్కడికి వచ్చి ప్రార్థన చేసి, 'తబితా లెమ్మ'ని అనగా ఆమె కన్నులు తెరచి చూచిలేచి కూర్చుండెను (అపొ.కా. **9:36-41**). అదే విధముగ ఐతుకు అను యౌవనస్థుడు గాఢనిద్రా భారము వలన మూడవ అంతస్తు నుండి జారి క్రింద పడి చనిపోగ ప్రసంగించుచున్న అపొస్తలుడయిన పౌలు సేవతో బ్రతికి అనేకులకు కలిగిన విశేషమైన ఆదరణకు కారకుడాయెను (అ.పొ. కా. **20:9-12**).

**ఎస్. ఆర్. తిరుగుళ్ళ**
**చీపురుపల్లి**

RNI Regd. No. 6997/98
Postal Regd. No. AP/KD-02/2009-2011

To

From:
**SATYA VAKKU**
**P.O. Box 80, Kakinada - 533 001**

Edited & Published by Joshua Gootam, Printed by him at Satya Vani Publication, Sambhamurthy St. Kakinada - 533 004